సాక్షి
జగిత్యాల
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్


ఖిలాపై స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత, అధికారులు

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

జగిత్యాల: స్వాంత్ర్య వేడుకలకు జిల్లా ముస్తాబైంది. జిల్లా కేంద్రంలోని ఖిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం ఉదయం జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఇందుకోసం మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వీవీఐపీలు కూర్చునేందుకు వీలుగా టెంట్లు, కార్పెట్లు సమకూర్చారు. అడిషనల్ కలెక్టర్లు లత, ఆర్డీవో నర్సింహమూర్తి, అధికారులు సోమవారం ఏర్పాట్లు పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వేడుకలకు హాజరయ్యే సందర్శకులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే ఖిలాలోకి అనుమతి ఇస్తారు. ఇప్పటికే పోలీసు, బాంబ్‌స్క్వాడ్ బలగాలు ఖిలాను తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో డీఎస్పీ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఖిలా ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 112 మంది పోలీసు కానిస్టేబుళ్లతో పహారా కాస్తున్నారు.

న్యూస్‌రీల్

అధిక మాసం వాయినం


అమ్మవారికి వాయినం ఇస్తున్న భక్తులు

మల్లాపూర్(కోరుట్ల): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీమాతా ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధికమాసం వాయినం ఇచ్చారు. అర్చకులు శ్యాంసుందర్ శర్మ, కిశోర్‌శర్మ స్థాపిత దేవతమూర్తులకు 33 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శివ రాంకిషన్, ప్రధాన కార్యదర్శి గుండ నరేందర్‌గుప్తా, కోశాధికారి సంగెం శ్రీనివాస్‌గుప్తా, వాసవీక్లబ్ అధ్యక్షుడు మేడి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సినిమా ప్రదర్శన


థియేటర్ ఎదుట విద్యార్థులు

జగిత్యాల: భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నుంచి జిల్లాలోని పలు సినిమా థియేటర్లలో గాంధీ సినిమా ప్రదర్శిస్తున్నారు. తొలిరోజు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని సినిమా థియేటర్లకు వెళ్లి గాంధీ చిత్రాన్ని తిలకించారు.

17, 18 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు

జగిత్యాల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మినీ స్టేడియంలో ఈనెల 17, 18వ తేదీల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, వాలీబాల్ ఆటల్లో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 2023–24కి గాను 14 నుంచి 18ఏళ్ల వయసు గల బాలబాలికలు అర్హులన్నారు. వీరికి క్రీడా అకాడమీల్లో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని వివరించారు. వివరాల కోసం 040–23243297 నంబరులో సంప్రదించాలని కోరారు.

కుష్ఠు అనుమానితులను గుర్తించండి


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

జగిత్యాల: గ్రామాల్లో ఉదయం 7 నుంచి ఉదయం 10 గంటల వరకు గృహ సందర్శన చేపట్టి కుష్ఠు లక్షణాలు ఉన్నవారి వివరాలు నమోదు చేయాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టాలని ఆయన సూచించారు. కుష్ఠు నిర్మూలన లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు సంపత్‌కుమార్, శ్రీనివాస్, రూప, మోతీరాం, ఇర్యానాయక్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: పీఎఫ్ నంబరు కోసమని బీడీ కంపెనీ యజమానులు ఒక్కో కార్మికుడి నుంచి రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారని కార్మిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు సోమవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాజమ్మకు నాయకులు ఒక వినతిపత్రం అందజేశారు. యూనియన్‌ల ద్వారా కాకుండా టేకేదారుల ద్వారా రాజీనామాలు చేయిస్తున్నారని వారు ఆరోపించారు. బీడీ కంపెనీ టేకేదారులు, యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

‘ఓపెన్’ నిర్లక్ష్యం

తుప్పు పడుతున్న పరికరాలు

- ధ్వంసమవుతున్న మ్యాట్లు
- కొన్నిచోట్ల దొంగలపాలు
- రక్షణలేని ఓపెన్‌జిమ్‌లు

జగిత్యాలటౌన్/కోరుట్ల/మెట్‌పల్లి/ధర్మపురి: ప్రజల శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం ఆయా పురపాలికల్లో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. నిర్వహణ లోపం, నాసిరకం పరికరాలు కావడం, మరమ్మతులు విస్మరించడంతో ఈ దుస్థితి నెలకొంది. సోమవారం జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లోని ఓపెన్ జిమ్‌లను పరిశీలించగా ఈ సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు అయిన చింతకుంట చెరువు, డిగ్రీ కళాశాల, ధరూర్ క్యాంపు, అమరవీరుల స్మృతివనం వద్ద ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. తొలుత సిమెంట్ బెడ్ నిర్మించి దానిపై ప్రత్యేకంగా రబ్బర్ మ్యాట్ ఏర్పాటు చేశారు. దానిపై వ్యాయామానికి వినియోగించే 13రకాల పరికరాలు బిగించారు. వర్షానికి తుప్పు పట్టకుండా, ఎండకు పాడవకుండా ప్రత్యేకమైన లోహంతో వీటిని తయారు చేశారు. ఇందులో ఎయిర్ స్ప్రింగ్, ఎయిర్ వాకర్, లెగ్‌ప్రెస్, డబుల్ క్రాస్ వాల్‌కీర్, బెంచ్ స్పిన్నర్, లెగ్‌లిఫ్ట్, వెయిస్ట్ ట్విస్టర్, రొయింగ్ మిషన్, పుల్‌చైర్, బిగ్‌ఆర్మ్ వీల్, హ్యాండ్ ఫోల్డర్, వెయిట్ ట్విస్టర్ వంటి పరికరాలు ఉన్నాయి.


జగిత్యాలలో తుప్పుపట్టిన పరికరం


జగిత్యాలలో తుప్పు పట్టిన పరికరాలపై కసరత్తు చేస్తున్న పట్టణ ప్రజలు

ధ్వంసం చేస్తున్న పోకిరీలు..

ఓపెన్ జిమ్‌ల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో కొన్నిచోట్ల పోకిరీలు జిమ్ పరికరాలు ధ్వంసం చేస్తున్నారు. మ్యాట్‌లను కొందరు ఇప్పటికే తగులబెట్టారు. నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. సుమారు రూ.కోటి వెచ్చించి పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఏజెన్సీ.. తొలిఏడాది నిర్వహణ బాధ్యతలు విస్మరించింది. రెండో ఏడాది నుంచి బల్దియా ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది కూడా పెద్దగా పెట్టించుకోవడం లేదు. దీంతో మరమ్మతులు లేక, రస్ట్ చేరి, అరిగిపోయి చాలా పరికరాలు పనికిరాకుండా పోతున్నాయి. ఓపెన్ జిమ్‌ల పరిశుభ్రత మచ్చుకైనా కనిపించడం లేదు.

ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. బల్దియా అధికారులు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. అరిగిన బేరింగ్‌లను మార్చాలి. తరచూ గ్రీజింగ్ చేయాలి. మరమ్మతు చేపట్టాలి.

– సాజిద్ పట్వారీ, మాజీ కౌన్సిలర్, జగిత్యాల

సొంతంగా భావించాలి



ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగమైన ఓపెన్ జిమ్‌లను పాడుచేయడం బాధాకరం. అందరి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను సొంత ఆస్తిగా భావించి కాపాడుకోవాలి.

– షేక్ అహ్మద్, స్థానికుడు, జగిత్యాల

చర్యలు తీసుకుంటాం



ఓపెన్ జిమ్‌ల నిర్వహణ బాధ్యత తొలిఏడాది ప్రైవేట్ ఏజెన్సీ యజమానులే చూసుకున్నారు. ప్రస్తుతం బల్దియా ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. పరికరాలు కాపాడుతాం.

– శరణ్ మున్సిపల్ ఏఈ, జగిత్యాల


ఇది మెట్‌పల్లి మినీ స్టేడియంలోని ఓపెన్ జిమ్. రూ.వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన టైల్స్ ఊడిపోతున్నాయి. మరమ్మతు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జిమ్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని తొలగించకపోవడంతో పట్టణవాసులు వ్యాయామం చేయలేకపోతున్నారు.

పర్యవేక్షణ లోపం

మెట్‌పల్లి(కోరుట్ల): మినీస్టేడియం, మండల పరిషత్ పార్క్‌లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వ్యాయామానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచారు. రోజూ ఉదయం, సాయంత్రం స్థానికులు కసరత్తు చేయడానికి వస్తున్నారు. అయితే, పరికరాలను తరచూ పరిశీలించి వదులుగా ఉండే బోల్టుల తోపాటు ఇతరత్రా వాటిని సరిచేయాలి. సరిగ్గా కదలడానికి పరికరాల్లో అవసరమైన చోట లూబ్రికేట్ చేయాలి. కానీ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. వర్షాలతో కొన్ని తుప్పు పట్టాయి. పరికరాలు సరిగా పనిచేయడం లేదు. అధికారులు స్పందించాలి.

బెంచీలు ఏర్పాటు చేయాలి



మినీ స్టేడియంలోని జిమ్‌కు రోజూ వెళ్తా. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసేవారితో రద్దీగా ఉంటోంది. సేద తీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. టైల్స్ ఊడిపోతున్నాయి. వాటికి వెంటనే మరమ్మతు చేపట్టాలి. పిచ్చిమొక్కలు తొలగించాలి.

– బత్తుల లక్ష్మణ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్

సమస్యలు పరిష్కరిస్తాం



మినీ స్టేడియం జిమ్‌లో టైల్స్ ఊడిపోతున్న మాట వాస్తవమే. వాటికి మరమ్మతు చేసే అవకాశం లేదు. సిమెంట్‌తో నిర్మించిన బెడ్ ఉంది. పిచ్చి మొక్కలను తొలగిస్తాం. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

కోరుట్లలో ఓకే..


కోరుట్ల కల్లూర్ రోడ్డులోని ఓపెన్ జిమ్

కోరుట్ల: మూడేళ్ల క్రితం కల్లూర్‌రోడ్డు, కళాశాల మైదానంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఏడాదిలోపు కొన్ని పరికరాలు దెబ్బతిన్నాయి. ఆ వెంటనే మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం రెండు ఓపెన్ జిమ్‌ల్లోని పరికరాలు బాగానే ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆసక్తి ఉన్నవారు సాధన చేస్తున్నారు.

తరచూ మరమ్మతు



ఓపెన్ జిమ్‌లను తరచూ పరిశీలిస్తున్నాం. దెబ్బతిన్న పరికరాలకు వెంటనే మరమ్మతు చేయిస్తున్నాం. ప్రస్తుతం అన్నీబాగానే పనిచేస్తున్నాయి. ఇంకా ఏమైనా లోపాలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే సరిచేస్తాం.

– రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

నాసిరకం పరికరాలు



ధర్మపురి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏడాదిన్నర క్రితం రూ.5 లక్షలు వెచ్చించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. మైదానానికి వచ్చిన వారు ఓపెన్‌జిమ్‌లోని పరికరాల ఆధారంగా వ్యాయామం చేస్తున్నారు. అయితే, బ్రాండెడ్‌కు బదులు నాసిరకం పరికరాలు బిగించడంతో తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. అంతేకాదు.. పరికరాల రక్షణ సమస్యగా మారింది. ఆకతాయిలు పరికరాలను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. దీంతో అవి ఎక్కడికక్కడే ఊడిపోతున్నాయి. ఇటీవల ఓ కాంట్రాక్టర్ ప్రత్యేక ప్లాట్‌ఫామ్ నిర్మాణం కోసం పునాదులు తవ్వి బేస్మెంట్ కట్టారు. ఆ తర్వాత వదిలేశారు.

కోటిలింగాల రాజగోపురం పనులు ప్రారంభం


పనులు ప్రాంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

వెల్గటూర్(ధర్మపురి): కోటిలింగాల శ్రీపార్వతీకోటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం పనులను సోమవారం ప్రారంభించారు. మెగా కంపెనీ సహకారంతో రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఐదంతస్తుల రాజగోపురం నిర్మాణానికి జూన్ 14న మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమిపూజ చేశారు. సోమవారం బేస్మెంట్ స్టీల్, కాంక్రీట్ వేసి పనులు ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, కంపెనీ జనరల్ మేనేజర్ నగేశ్, ఆలయ ఈవో కాంతారెడ్డి, చైర్మన్ పదిరె నారాయణరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన వెంటనే రికవరీ

జగిత్యాలక్రైం: సైబర్ నేరగాళ్ల బారినపడ్డవారు తక్షణమే ఫిర్యాదు చేస్తే డబ్బు రికవరీ చేసే వీలుంటుందని ఎస్పీ భాస్కర్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ ప్రైవేట్ ఉద్యోగి వినోద్‌కుమార్‌కు సైబర్ నేరగాడు క్యూబిక్ యాప్ పంపించాడని, దానిని ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతాలోని రూ.4,70,000 కాజేశాడని తెలిపారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే 1930 నంబరుకు కాల్‌చేయడంతో సైబర్ టీం స్పందించిందన్నారు. సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమైన రూ.2,54,000 రికవరీ చేశారని వివరించారు. సైబర్ మోసాల బారినపడ్డవారు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930, డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్పీ చెప్పారు. www.cybercrime.gov.in వెబ్ సైట్ ద్వారా సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేసే వీలుందని ఆయన పేర్కొన్నారు. డబ్బులు రికవరీ చేయడంలో కీలకపాత్ర పోషించిన ఐటీ సెల్ ఎస్సై దినేశ్, ఐటీకోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బాధితులకు సత్వర న్యాయం

వివిధ సమస్యలతో పోలీసులను ఆశ్రయించే వారికి సత్వర న్యాయం అందించేందుకే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 31 మంది నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. అమెరికా, ఇంగ్లండ్, స్విర్జర్లాండ్, కెనడా, సౌత్ కొరియా, సింగాపూర్ తదితర దేశాల్లో పీజీ కోర్సులు చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని పేర్కొన్నారు. రూ.20లక్షలతోపాటు, వీసా, టికెట్ దీనిద్వారా అందుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు tsepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 63028 82400 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీరాజంది సుపారీ హత్యే

- దోషులను ఉరి తీయాలి
- కేసును సీబీఐకి అప్పగించాలి
- ముదిరాజ్ మహాసభ డిమాండ్
- కులబాంధవుల నిరసన ర్యాలీ
- కన్నీరు పెట్టుకున్న మృతుడి భార్య

కోరుట్ల: బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పోగుల లక్ష్మీరాజంది ముమ్మాటికీ సుపారీ హత్యేనని ముదిరాజ్ మహాసభ పేర్కొంది. కేసును సీబీఐకి అప్పగించాలని, దోషులను పట్టుకుని ఉరితీయాలని డిమాండ్ చేసింది. ఈమేరకు ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మృతుడు లక్ష్మీరాజం చిత్రపటాల ఫ్లెక్సీలు పట్టుకుని పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెద్దమ్మ గుడి నుంచి కార్గిల్ చౌరస్తాకు వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ రోడ్డుపై ధర్నా చేశారు. లక్ష్మీరాజం భార్య ఉమారాణి కంటతడి పెట్టుకున్నారు. కొందరు సుపారీ ఇచ్చి తన భర్తను అన్యాయంగా చంపించారని ఆరోపించారు. దోషులను పట్టుకుని తన భర్తను చంపిన చోటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు పెద్దులు పులి నర్సయ్య, కోడి అంతయ్య మాట్లాడుతూ, ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి రాజకీయంగా ఎదుగుతున్న పోగుల లక్ష్మీరాజం హత్య తమను కలచివేసిందన్నారు. సంచలనం కోసమే ఈ హత్య జరిగిందని పోలీసులు చెప్పడంలో నిజం లేదని అన్నారు. సీఎం కేసీఆర్, హోంమంత్రి జోక్యం చేసుకుని ఈ హత్యపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటన్నర పాటు ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి కూరపాటి అరుణజ్యోతి, కరీంనగర్ మత్స్య సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు పోలు లక్ష్మణ్, కోరుట్ల ముదిరాజ్ సమాఖ్య అధ్యక్షుడు ఉరుమడ్ల శ్రీనివాస్, నాయకులు ఎడ్ల రమేశ్, కలాల భూంసాయిలు, పాతర్ల నర్సయ్య, పీసరి అశోక్, న్యాయవాది వెల్మల రాంబాబు, రేండ్ల రమేశ్, అల్వాల శంకర్, సత్యనారాయణ, పోగుల లింగమూర్తి, తుపాకుల భాజయ్య, పోన్నం గోపాల్, జాగిలం భాస్కర్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

క్లుప్తంగా

రుణాలను సకాలంలో చెల్లించాలి



చెక్కులు అందజేస్తున్న చైర్మన్

ధర్మపురి : రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు రూ.15 లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. వ్యవసాయ పనుల కోసం తక్కువ వడ్డీకే సంఘం రుణాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్లాగౌడ్, దాసరి లచ్చయ్య, సీఈవో అయ్యోరి రాజేశ్, తదితరులున్నారు.

చిన్నాపూర్ సర్పంచ్‌గా లతశ్రీ

- ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్



ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న ఎంపీవో

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్ సర్పంచ్‌గా తిరిగి దమ్మ లత శ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ యాస్మిన్ బాషా ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వుల కాపీని సోమవారం మండల పంచాయతీ అధికారి ఆమెకు అందజేశారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లతో గతనెల 11 రాజీనామా చేయగా డీపీవో దేవరాజు ఆమోదించారు. తనను కనీసం వివరణ కోరకుండానే రాజీనామాను ఆమోదించడం పట్ల లత శ్రీ హైకోర్టును ఆశ్రయించారు. కాగా డీపీవో రాజీనామాను ఆమోదించడం చెల్లదని, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తిరిగి లత శ్రీ నే గ్రామ సర్పంచ్ కొనసాగాలని పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమె రాజీనామా ఆమోదాన్ని నిలుపుదల చేస్తూ సర్పంచ్‌గా కొనసాగాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- మంత్రి కొప్పుల ఈశ్వర్



చెక్కులు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ధర్మపురి: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో సోమవారం బీసీబంధు పథకాన్ని కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి మంత్రి ప్రారంభించారు. కుల వృత్తులు అంతరించిపోకుండా సీఎం కేసీఆర్ బీసీబంధు అమలులోకి తెచ్చారన్నారు. పేదలకు రూ.లక్ష సాయం చేయడం ద్వారా ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ నుంచి తొలివిడతతో 400 మంది కులవృత్తిదారులను ఎంపిక చేసి చెక్కులు అందించామని చెప్పారు. బీసీబంధు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటాపాట ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన ఎజెండా

వెల్గటూర్(ధర్మపురి): గ్రామాల అభివృద్ధే ప్రధాన ఎజెండాగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి దేశంలో ఎక్కడా లేదన్నారు. ప్రగతిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు విషయం చిమ్ముతున్నాయని విమర్శించారు. ఇన్నేళ్లుగా ఆదరించి ఆశీర్వదించినందుకు ప్రతీఒక్కరిని కడుపులో పెట్టుకున్నానని తెలిపారు. మరోసారి ఆశీర్వదిస్తే పదింతలు అభివృద్ధి చేసి, ప్రజల రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, సర్పంచులు అనుమాల తిరుపతి, మారం జలందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొర ఆలకించండి

- సమస్యలు పరిష్కరించండి
- ప్రజావాణికి అభాగ్యుల వినతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్‌బాషా.. ప్రజావాణి ద్వారా అందే సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత, అధికారులు పాల్గొన్నారు.

మోస పోయాం

బతకుదెరువు కోసం విదేశాలకు వెళ్లాలనే ఆశతో జగిత్యాలకు చెందిన విఘ్నేశ్వర కన్సల్టెన్సీని ఆశ్రయించినం. యూరప్ పంపిస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు తీసుకున్న ఏజెంట్ రాచకొండ మహేశ్.. మమ్మల్ని విదేశాలకు పంపించక మోసం చేశాడు. మా డబ్బులు, పాస్‌పోర్టు ఇప్పించండి. – కన్సల్టెన్సీ బాధితులు

పరిహారం ఇప్పించండి

భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లో పోసిన చేపపిల్లలు, చేపలు కొట్టుకుపోయినయి. రైతులకు ఇస్తున్నట్లుగానే ఒక్కో మత్స్యకారుడికి రూ.పదివేల పరిహారం అందించి ఆదుకోవాలి.– మత్స్య సహకార సంఘం సభ్యులు

స్లాట్ రద్దు చేయించండి

రెవెన్యూ పరిధిలోని ఖాతా నంబర్ 1045లో గల నా పట్టాభూమి నాకు తెలియకుండానే వేరేవారు విక్రయం కోసం ధరణిలో స్లాట్ బుక్ చేశారు. అక్రమంగా బుక్ చేసిన స్లాట్‌ను రద్దు చేయించండి. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోండి. నాయకు న్యాయం చేయండి.

– పాలకుర్తి సతీశ్, గ్రామస్తుడు, బుగ్గారం

హద్దులు గుర్తించండి

జైనా గ్రామంలోని సర్వేనంబర్ 744ఆలో ఉన్న రహదారి ఆక్రమణకు గురైంది. దాదాపు 40 కుటుంబాలు ఇళ్ల నుంచి బయటకు రావడం, ఇళ్లలోకి వెళ్లడం కోసం దారిలేదు. పూర్వపు నక్షాలో తొవ్వ ఉంది. దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి. రహదారికి హద్దులు నిర్ణయించండి. – జైనా గ్రామ మహిళలు, భూలక్ష్మి

పంచాయతీగా మార్చండి

బీర్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆసునూరి తండా, లంబాడి తండా, నాయకపుగూడెం తండాలను కలిపి ఆసునూరి తండా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి. తద్వారా మా ఇబ్బందులు తొలగించండి.

– తండావాసులు

ఉపాధి కల్పించండి

కథలాపూర్(కోరుట్ల): మా సమీపంలోని ఇప్పపెల్లి శివారులో ఈత, తాటి చెట్లకు కల్లు గీస్తూ ఏళ్లుగా ఉపాధి పొందుతున్నాం. ఇటీవల ఇప్పపెల్లి గీతకార్మికులు ఈత, తాటివనంలోకి రానివ్వడంలేదు. మెట్‌పల్లి ఆబ్కారీశాఖ అధికారులకు విన్నవించినం. గీత వృత్తిపై 20 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. అందులో మాకు గతంలో మాదిరిగానే ఉపాధిని కల్పించాలి.

సర్టిఫికెట్ అందజేత



సర్టిఫికెట్ అందుకుంటున్న బొడ్డు రాజేశ్

మల్లాపూర్ : యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు, కైరోప్రాక్టర్ డాక్టర్ బొడ్డు రాజేశ్ (సాతారం) వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్నారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లో ఇండో అమెరికన్ ఆల్టర్నేటివ్ మెడికల్ కేర్ ఆధ్వర్యంలో కైరోపతి శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కైరోపతి శిక్షణ ఇచ్చిన డాక్టర్ షాహెద్‌బేగ్‌ను వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ గుర్తించి అవార్డును అందజేశారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న రాజేశ్‌కు అవార్డులో భాగస్వామ్యం కల్పిస్తూ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందజేశారు. ఇంటర్నేషల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ ముడుపు రాం ప్రకాశ్, డాక్టర్ సఫియా షీరిన్, ఇతర రాష్ట్రాలకు చెందిన కైరోప్రాక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు

జగిత్యాలక్రైం: ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేసి మోసం చేయడంతో సోమవారం బాధితులంతా పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మహేశ్ జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డులో కొంతకాలంగా శ్రీ విఘ్నేశ్వర కమ్యూనికేషన్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ట్రావెల్స్‌ను ఏర్పాటు చేశాడు. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి అందినకాడికి దోచుకున్నాడు. ఐదు రోజులుగా పరారీలో ఉండటంతో మోసపోయామని భావించిన బాధితులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈనెల 10న సైతం ఎస్పీ భాస్కర్, డీఎస్పీ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాధితుల వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం గల్ఫ్ ఏజెంట్ దొరికాడని వదంతులు రావడంతో బాధితులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పరారీలో ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో వారు అక్కడినుంచి వెనుదిరిగారు.

గల్ఫ్ బాధితులకు అండగా ఉంటా

జగిత్యాలక్రైం: నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బాధితులు ఎస్పీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధితులతో కలిసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శైలేందర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

'గల్ఫ్ బాధితులకు భరోసా లేదు'



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): గల్ఫ్ బాధితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పిస్తామన్న భరోసా ఏదని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పస్తం సాయిలు గల్ఫ్‌లో ఆత్మహత్య చేసుకోగా... సోమవారం బాధితకుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ కార్మికులకు రైతుబీమా పథకం వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. గల్ఫ్‌లో మృతిచెందినవారి శవాలను స్వగ్రామాలకు తెప్పించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రత్యేక కోటాలో డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు ఉరుమడ్ల లక్ష్మణ్, మధు, అరుణ్, జీవన్, ప్రేమ్, విజయ్, రమేశ్, లవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు సూచించారు. ఇటీవల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావును సోమవారం టీఎన్జీవో నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి, సాహెద్‌బాబు, రాములు, మహేందర్ పాల్గొన్నారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రెండు ద్విచక్రవాహనాలు, రూ.54 వేలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ నటేశ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ నటేశ్

జగిత్యాలక్రైం: ద్విచక్రవాహనాలతోపాటు, బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా తాండా తాలూక గరిడి గ్రామానికి చెందిన బుర్సింగ్, ఉదన్‌సింగ్, మహేశ్, మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా ఉక్సి తాలూక నార్వాలి గ్రామానికి చెందిన ఉమేశ్ చవన్ ముఠాగా ఏర్పడ్డారు. గతంలో పలు ప్రాంతాల్లో సుమారు పది, పదిహేను దొంగతనాలకు పాల్పడగా జైలునుంచి ఇటీవల విడుదలయ్యారు. కొద్దిరోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఇంటిముందు పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలతో పాటు బృందావన్ కాలనీ, హైటెక్ కాలనీల్లోని రెండిళ్లలో రెండు గ్రాముల బంగారం, రూ.54 వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం పట్టణ పోలీసులు పాత బస్టాండ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. అక్కడ వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకొని విచారించారు. పలు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సై అబ్దుల్ రహీం, ఏఎస్సై వేణురావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, కానిస్టేబుళ్లు లక్‌పతి, పాల్గొన్నారు.